# అయితే గియితే...

—అయితే,గియితే చాలా బావుండును—లేకుంటే ఏమిటీ, ప్రతినిముషమూను, వెనకాలే మోత! ఎప్పుడు ఏ సినిమాకు బయలుదేరినా ఇదే గొడవ. 'చదువూ సంధ్యా లేదు: ఎప్పుడూ సినిమాలే!' అంటూను.

పరీక్ష పేపర్లుచూస్తే...ఎప్పుడుచూసినా ఎందుకూ పనికిరాని ప్రశ్నలు. ఈ మహాప్రశ్నలు మా జీవితంలో ఎందుకు పనికివస్తాయో తెలీదు. అసలు ఇది నిజమైన తెలివితేటలకు పరీక్షఅయితేగా!?!

ఇలా కాకుండా, పరీక్షల్లో 'నీకు నచ్చిన ఉత్తమ చిత్రం ఏదీ? దానిని విమర్శకాపూర్వకముగా వివరింపుము!'

'ఫలానాచిత్రం ఎవరు తయారుచేశారు? ఎవరెవరు నటనలో పాల్గొన్నారు? సమాచారం పూర్తిగా వివరించునది!'

'నీకు ఏ తార అంటే ఇష్టం. ఆ తారయొక్క పూర్తివివరాలు ఇవ్వు.'

అలాంటిప్రశ్నలు వేస్తే ఎంతబావుండును!

ఎంత చలాకీగా, ఉత్సాహంతో జవాబిద్దుమూ!

అప్పు డేమవుతుందంటే; సినిమాలంటే మూలిగే ఈ పేరెంట్సు "సినిమాకి వెళ్లు. వెళ్ళమంటే. చెప్పిన మాటవినవూ. నా బంగారంకాదూ. వెళ్లు. సినిమాకివెళ్లి చక్కగా చూసిరా, ఏం? కుర్చీ టిక్కట్టు కొనుక్కో. పోనీ 'క్రష్'కు ఓ పావలా కూడా తీసుకో—నాముద్దులతల్లీ వెళ్లిరా, సినిమాకి-ఏం?' అంటూ వెనకాలతోస్తారు!

సినిమాకి వెళ్ళకపోతే "ఛీ! ఛీ! పాడయిపోతున్నారు! బాగుపడేయోగం ఉంటేగా—గ్రహచారం (!) సినిమాకి వెళ్ళకపోతే ప్రోగ్రెస్ ఏముంటుంది. అబ్బబ్బ! పాడయిపోతున్నారు సినిమాకి వెళ్లక!" అంటారు!

అప్పుడప్పుడూ బండికట్టించి మరీ సినిమాలకు పంపుతారు!

ఒకొక్కప్పుడు సినిమాకివెళ్ళామో లేదోనని, సినిమా గేటులోకివచ్చి మేం సినిమాలో కూర్చోవడంచూసి సంతుష్టిచెంది, ఇంటికిపోతూ 'మా అమ్మాయి చాలా మంచిది. చెప్పినమాట చేస్తుంది. మార్కులంటే చేతులు కోసుకుంటుంది. ఎంత 'ఇంటరెస్టు'! రోజూ విడవకుండా సినిమాకి వెళుతుంది!' అనుకుంటారు.

ఇంటివద్ద మా నాన్నగారు అమ్మని 'ఒసే, మొద్దూ, ఇంకా వంటయిందా లేదా? అమ్మాయి సినిమాకి వెళ్లొద్దూ, అప్పుడే టైమైపోతోంది! ఊఁ—ఆలస్యమయితే ఎట్లా? పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇవ్వాళ రెండాటలకూ వెళ్ళాలి అమ్మాయి" అని గదమాయిస్తారు.

తరువాత 'అమ్మాయీ ఏదో శ్రమ. పరీక్షలు నాలుగురోజులే ఉన్నాయి. కొంచెం ఓపిక పట్టాలి. ఈ నాలుగురోజులూ మూడాటలూ సినిమాలు చూద్దూ! చూడగానే సరా, సినిమా కథనూ, నడకనూ, ట్రీట్ మెంటునూ, సంఘటనలనూ, ప్రారంభాన్నీ; అంతాన్నీ, ఇందులో 'టచ్'లూ 'సజషన్లూ' టెక్నిక్ ఇలాంటివిషయాలు మెదడుకు పట్టించుకోవాలి. జ్ఞాపకముంచుకుంటున్నావా? ఒకటేధ్యాస ఉండాలి. ఎప్పుడు ఏ సినిమా వస్తుందా? ఎప్పుడు ఏది పోతోందా కనిపెడుతూ వుండాలి. తెలిసిందా?"

పరీక్షలు అయిందాకా సినిమా హాలువద్దకువెళ్లి 'ఏమండీ, ఈ సినిమాతాలూకు పెద్ద కరపత్రమేమన్నా ఉందా?' అనీ.

వాళ్ళనీ వీళ్లనీ 'ఏమండోయ్ కొంచెం 'హెరాల్డ్సు' సంపాయిద్దురూ అందులో మా అమ్మాయికి కావలసినవివరాలు ఉంటాయి-ఏం. మరిచిపోకండి. అంటూ.

ఒరే అబ్బాయీ, "సినిమాపత్రికలు అన్నిభాషల్లోనూనూ కొనండ్రా! బజారులో అమ్మనివి ఏమన్నాఉంటే పత్రికల' ఆఫీసులకురాసి తెప్పించండి. దినపత్రికల్లోంచి కటింగ్సు సంపాదిస్తున్నారా? జాగ్రత్తచేయండి, సినిమా బొమ్మలూ మొదలయినవి' అంటారు.

ఎప్పుడన్నా ఏదన్నా మాట్లాడుకుంటూంటే 'అమ్మాయీ, ఏమిటీ ఈ కబుర్లూ, కాస్త సినిమా తారలూ, అందాలూ, పాషన్లూ ఇలాంటివి మాట్లాడుకోకూడదూ?" అని కేకలేస్తారు. ఎంత బావుండును!

—రచన : జి. ప్రభ